# ఓ జాలి కథ

"యువరానర్!" పబ్లిక్ ప్రాసిక్యూటరు గారి గొంతు ఖంగున మ్రోగింది.

ప్రాసిక్యూషన్ సాక్షుల విచారణ అనంతరం కేసును సమీక్షించడానికి ప్రారంభించారు రంగనాథంగారు.

ప్రత్యక్షసాక్షులువున్నా వారు ప్రాసిక్యూషను కేసుకు వ్యతిరేకంగాసాక్ష్యం ఇవ్వడంతో, సూచనాపూర్వకమైన సాక్ష్యాల ద్వారా నిరూపించవలసిన హత్యకేసు అది.

రంగనాథంగారు ఒక్కసారి కోర్టు హాలంతా కలయజూచారు ఒక తల్లి తన కొడుకును చంపిన హత్యకేసు కొబట్టి జనం విపరీతంగా వచ్చారు. గాలరీ కిటకిట లాడుతోంది.

ముద్దాయి లక్ష్మి బోనులో తలవంచుకొని నిలబడివుంది. ముద్దాయి తరపున ప్రభుత్వంచే నియమించబడ్డ వకీలు మిస్ లలిత కుతూహలంగా ప్రాసిక్యూటర్‌ను చూస్తోంది, కేసు ఏమి మలుపులు త్రిప్పుతాడో అని.

బల్లమీద వున్నగ్లాసులోని మంచినీళ్ళు త్రాగి గొంతు సవరించుకొని తన సమీక్ష ప్రారంభించారు రంగనాథం గారు—

"యువరానర్ ముద్దాయి లక్ష్మి ఉద్దేశపూర్వకంగా ఈ హత్య చేసింది. తన రెండు నెలల పసికందును గ్రుడ్డి వాడనే నెపంతో బావిలో త్రోసి మరీ చంపింది. పైకి తేలకుండా ఒకరాయికూడా ఆ బిడ్డకు కట్టింది. ఇంత దారుణంగా తన కన్న కొడుకును నిర్దాక్షిణ్యంగా చంపిందంటే ఇంతకన్నా ఘోరం మరొకటివుండబోదు. ఈ విషయం ప్రాసిక్యూషన్ సాక్షులు నిరూపిస్తున్నారు.

"యువరానర్ ! మొదటి యిద్దరి సాక్షులు ముద్దాయి, చనిపోయిన రాము అనే గ్రుడ్డిపిల్లవాడిని తీసుకొని, హత్యజరిగిన రోజు వుదయం ప్రక్కవూరు రామాపురానికి బయలుదేరారు. కాని వూరి పొలిమేరలలో గలదిగుడు బావి వద్దకు రాగానే, ముద్దాయి ఒక రాయితీసి గుడ్డలో మూట గట్టి దానిని బిడ్డనడుమునకు కట్టింది. 'అది ఏమిటి' అనిసాక్షులు అడుగగా తన పిల్లవాడిని బావిలో వేస్తున్నట్టుముద్దాయి ఏడుస్తూ చెప్పింది; అవి తప్పని, అలా చేయడం నేరమని సాక్షులు చెబుతున్నా వినకుండా ముద్దాయి ఆ గుడ్డి పిల్లవాడిని బావిలోవేసింది

"యువరానర్ ! ఇది మేజిస్ట్రేట్‌కోర్టులో సాక్షులు చెప్పింది. కాని తమరి ముందర, తాము ముద్దాయి వెంట వెళ్ళామేగాని ఆమె బిడ్డను బావిలోవేయడం చూడలేదన్నారు.

"ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి చనిపోయిన రామూ రెండు నెలల పసికందు. గ్రుడ్డివాడు. బిడ్డను ముద్దాయి బావి దాకా తీసుకుపోయినట్టు సాక్ష్యం వుంది' అయితే రాము తనంతట తానే బావిలో పడ్డాడా. నడుముకు రాయికట్టుకొని మరీ పడ్డాడా. ఇది నమ్మరాని విషయం. కాబట్టి ఎవరో నడుముకు రాయి కట్టి బావిలోవెయ్యాలి. అయితే ఆ పని చేసినవారెవరు. అక్కడ వున్నది ముగ్గురు ముద్దాయి. ఇద్దరు సాక్షులు. ముద్దాయి దగ్గర వున్న బిడ్డను బలవంతంగాగాని లేక మరే విధంగాగాని తీసుకొని, నడుముకు రాయికట్టి బావిలో వెయ్యాల్సిన అవసరం ఉద్దేశం సాక్షులకు లేవు. అయినా తన బిడ్డను పరాయివాళ్ళు హత్యచేస్తూవుంటే ఏ తల్లీ చూస్తూవూరుకోదు. ఇక మిగిలింది—ముద్దాయి. కాబట్టి ఈ హత్య చెయ్య చెయ్యడానికి ఒక్క ముద్దాయికి మాత్రమే అవకాశంవుంది."

క్షణంసేపు ఆగారు రంగనాథంగారు. బల్లమీదవున్న గ్లాసులోని నీరు ఒక్కగుక్క త్రాగి మొహం తుడుచుకున్నారు. లలిత ఆత్రుతగా చూస్తోంది. ప్రాసిక్యూషన్ కేసును గోడ కట్టినట్టు కడుతున్నారు ప్రాసిక్యూటర్‌గారు.

"యువరానర్ ! ముద్దాయి నేరంచేసిందనటానికి మరొక బలమయిన నిదర్శనం ఆమె తన అక్కగారి ముందు నేరం వప్పుకోవడం. హత్య జరిగినపుడు ముద్దాయి తన అక్కగారి యింట్లో నివసిస్తోంది. హత్య జరిగిన రోజు వుదయం బిడ్డని తీసుకొని అక్కగారితో ప్రక్కవూరికి వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిన ముద్దాయి, మధ్యాహ్నానికి వట్టి చేతులతో తిరిగివచ్చింది. బిడ్డ ఏది అని అడుగగా తనే బావిలోవేశానని ముద్దాయి తన అక్కగారి ముందర వప్పుకొంది. తరువాత ఆమె ముద్దాయిని తిట్టి ఇంటి నుంచి వెళ్ళగొట్టింది

"ఈ సందర్భంలో కోర్టువారు ఒక విషయం గమనించాలి. ఈ సాక్షి ముద్దాయికి స్వయానా అక్కగారు. ముద్దాయిని భర్తవదిలివేస్తే ఆమెను, పిల్లల్ని తన దగ్గరవుంచుకొని పోషించింది. ఆటువంటి ఆమె తన చెల్లెలి మీద అనవసరంగా హత్యానేరం మోపదు. ముద్దాయి కాకుండా మరెవరైనా హత్యచేసి వున్నట్లయితే ముద్దాయి హత్యానేరం ఒప్పుకోకుండావున్నట్లయితే, ఆమెకు ముద్దాయే హత్యచేసిందని చెప్పవలసిన అవసరం, కక్ష ఏమీలేవు, కొబట్టి ఈమె సాక్ష్యానికి కోర్టువారు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

"తరువాత, శవం బావిలో తేలగానే, 4వ సాక్షి దారినపోతూ చూచి, గ్రామ మున్సబుకు చెప్పగా ఆయన పోలీసులకు రిపోర్టు పంపడం, తరువాత పోలీసులు వచ్చి శవాన్నిబయటకు తీసి, శవ పరీక్షచేయించి విచారించగా ఆ శవం ముద్దాయి కుమారునిదని తేలింది. మొదటి ఇద్దరు సాక్షులు పోలీసుల ముందర ముద్దాయి నేరం చేస్తుండగా చూచామని ఒప్పుకున్నారు. ఆ సాక్ష్యాల ఆధారంగా చార్జి షీటు దాఖలు చేయడం జరిగింది. పై సాక్ష్యాల ఆధారంతో ప్రాసిక్యూషను ముద్దాయిమీద నేరం ఏటువంటి అనుమానానికి ఆధారం లేకుండా నిరూపించింది. కొబట్టి, యువరానర్, ఈ ముద్దాయి అమానుషంగా, నిర్దాక్షిణ్యంగా, కనీసం కన్నతల్లి నన్న మమకారం కూడాలేకుండా తన కన్నబిడ్డను హత్యచేసింది. బావిలో త్రోసి మరీ చంపింది. పై కారణాలవల్ల, ముద్దాయికి మరణ శిక్ష విధించి న్యాయ పరిరక్షణచేస్తారని ఆశిస్తూ నా వాదనముగిస్తున్నాను."

ఒక్కసారి కోర్టు హాలంతా కలయజూచి

● ఎమ్వీ సుబ్రహ్మణ్యం

రంగనాధంగారు తమ సీట్లో కూర్చున్నారు. ప్రాసిక్యూటరుగారి సుదీర్ఘమైన వుపన్యాసం విన్న తరువాత ముద్దాయి లక్ష్మికి శిక్ష ఖాయమని గాలరీలో గుస గుసలు ప్రారంభమయ్యాయి.

డఫేదారు 'సైలన్స్'అని కేకపెట్టడంతో అందరూ శ్రద్ధగా జడ్జిగారికేసి చూచారు

డిఫెన్సు లాయరు లలిత భారంగాలేచి నిలబడింది ప్రాసిక్యూటరుగారి సమీక్ష విన్న తరువాత లక్ష్మిని రక్షించటం చాల కష్టం అపినించింది లలితకు.

లలిత ఇటీవలనే ప్రాక్టీసుపెట్టింది వృత్తికిబాగా క్రొత్త. దానిలోవున్న మెళుకువలు అంతగా తెలియవు ముక్కుసూటిగాపోవటం, నిర్మొహమాటంగా మాట్లాడటం ఆమెకు అలవాటు ముద్దాయి లక్ష్మి తాను నిస్సహాయురాలినని చెప్పడంతో లలితను ముద్దాయి తరపు న్యాయవాదిగా కోర్టువారు నియమించారు.

లక్ష్మి దీనస్థితిచూస్తే లలితగుండె తరుక్కుపోయింది మొట్టమొదటిసారిగా లక్ష్మిని జైల్లో కల్సుకున్నపుడు ఆమె అన్నమాటలు వింటుంటే కన్నీళ్ళు ఆగలేదు లలితకు

"అమ్మా! నేను నేరంచేయలేదని చెప్పడంలేదు. నేను పాపాత్మురాల్ని కన్నకొడుకును చేతులారా చంపుకున్న పాపిష్టిదాన్ని నాకు బ్రతకాలని ఆశలేదు కాని, నా పిల్లలు వాళ్ళకోసమేనమ్మా నా ఆవేదనంతా నాకు వేసే శిక్ష వాళ్ళకు కూడావేయమని నా తరపున కోర్టువారిని అర్ధించండమ్మా. సాటిఆడదానిగా మిమ్మల్ని వేడుకుంటున్నాను నాబిడ్డల్ని దిక్కులేనివాళ్ళగా చేయకండి" అని వలవలా ఏడ్చింది

లలిత గుండె కలిచివేసినట్లయింది లక్ష్మి తన అక్కగారి ముందు నేరం వప్పుకోడంతో కేసు బాగా పటిష్టం అయింది అయినా ప్రయత్నలోపంలేకుండా వాదించడానికి పూనుకుంది

"యువరానర్! పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారి వాదనవిన్న తరువాత ఇంకా ముద్దాయి హత్యచెయ్యలేదని వాదించలేను తను చేసిన పని ముద్దాయి స్వయానా తన అక్కవద్ద వప్పుకొన్నది. కాని నేను కోర్టువారిని అర్ధించేది ఒకటి ముద్దాయి నేరంచేసిందా? లేదా? ఈ ప్రశ్న కోర్టువారికేకాదు. ఎవరికైనా విచిత్రంగా కన్పించవచ్చు కాని ముద్దాయి నేరం చెయ్యలేదు అమె చేసింది నేరంకాదు ఆమె తన కన్న బిడ్డను ఏ పరిస్థితుల్లో చంపవలసి వచ్చిందో కోర్టువారు విచారించాలి ప్రాసిక్యూషన్‌వారు నేరారోపణకు సంబంధించి సంతవరకే కోర్టుకు మనవిచేశారు

"ఈ ముద్దాయి మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది తల్లి తండ్రి పోవడంతో అక్క దగ్గర పెరిగింది. అక్కగారు ఆమెకు యుక్తవయసు రాగానేవివాహంచేశారు. ఇక్కడే విధి వక్రించింది. లక్ష్మి భర్తకు లక్ష్మి కన్నముందే మరొకరితో వివాహంఅయింది. ఆ వధువు పేరు 'పేకాట పేకాటలోపడితే భార్యకాదుకదా ప్రపంచాన్ని మర్చిపోతాడు_



ఆ పెద్దమనిషి అలాంటి బాధ్యతారహితుడు ఒక బాధ్యతను మాత్రం సక్రమంగా నిర్వర్తించాడు తత్ఫలితమే ముగ్గురు పిల్లలు కలిగారు కాని లక్ష్మి దురదృష్టం కొద్దీ మూడవ పిల్లవాడు గ్రుడ్డివాడు గుడ్డివాడ్నికన్న నేరానికి భర్త లక్ష్మిని వదిలేశాడు. తప్పంతా ఆమెదేఅయినట్టు అద్దె ఇవ్వకపోవడంతో ఇల్లుగల ఆసామి లక్ష్మిచేత ఇల్లు ఖాళీ చేయించాడు నిరాశ్రయంగా ముగ్గురు పిల్లలతో వీధిలో నిలబడింది లక్ష్మి భవిష్యత్తు అంధకార బంధురం ఏంచెయ్యాలో తోచదు ఎక్కడికివెళ్ళాలో తెలియక విధిలేక అక్కగారి యిల్లుచేరింది

ఒకరోజు ఆ వూరిలోవున్న డాక్టరుగారి వద్దకు తన గుడ్డి పిల్లవాడ్ని తీసుకొని వెళ్ళిందిఅప్పటికేఒకధనవంతుడి కడుపుఆకలి నొప్పి గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న డాక్టరు ఆ పిల్లవాడికి ఇక చూపురాదన్నాడు!

మిగిలిన ఒక్క ఆశాకిరణం అంతరించడంతో లక్ష్మి బ్రతుకే చీకటయింది ఆ గుడ్డి పిల్లవాడి భవిష్యత్తు గురించి ఆలోచించడానికే భయంవేసేది. వాడు పెరిగి పెద్దవాడై ఏంచేస్తాడు? ఒకరి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఎంతకాలం బ్రతుకుతాడు.

"అయ్యా గ్రుడ్డివాడ్ని – అమ్మా గ్రుడ్డివాడ్ని-

ధర్మం చెయ్యండిబాబూ "అంటూఅడుక్కుతింటూ బ్రతకాల్సిందేనా అలా బ్రతికి వాడు సాధించేదేమిటి? అలాటి బ్రతుకు బ్రతుకుతూ వాడు అనుభవించే సుఖం ఏమిటి? ఇన్ని ఆలోచనల్తో లక్ష్మి మనసు రాయి అయిపోయింది. ఇంక ఆలోచించే శక్తి ఆమెలో సన్నగిల్లింది. కన్న తల్లిగా వాడికి తను ఏం చెయ్యగలదు. ఆ బిడ్డను అలాంటి

అంధకారబంధురమైన, అసహ్యమైన జీవితాన్నుండి ఎలా తప్పించడం? ఒకటే మార్గం. ప్రయోజనంలేని బ్రతుకు బ్రతకడంకన్న చావు మేలు. ఈ నిర్ణయం తీసుకుంది లక్ష్మి తత్ఫలితమే ఈ నేరం. ఈ విచారణ."

"యువరానర్! ఇప్పుడు చెప్పండి. ఈ హత్యకు ఎవరు బాధ్యులు? లక్ష్మి! కాదు- ముమ్మాటికీ కాదు. ప్రతి తల్లి, తన బిడ్డబాగా బ్రతకాలని కోరుకుంటుంది. గొప్పవాడుకావాలని కోరుకుంటుంది– కీర్తిప్రతిష్ఠలార్జించాలని ఉవ్విళ్ళూరు తుంది. కాని, గ్రుడ్డివాడుగా, భిక్షగాడుగా, అందరిచేత 'ఛీ' అనిపించుకునే జీవితాన్ని కోరదు. ఒకరి దయా దాక్షిణ్యాలమీద బ్రతికే నీచపు జీవితాన్ని ఆశించదు. అందుకే ఒక కన్నతల్లిగా, ప్రేమకురిపించే మాతృమూర్తిగా ఆ పిల్లవాడికి శాశ్వత సౌఖ్యాన్ని ప్రసాదించింది.

"ఇది నేరమా! ఇదే నేరమైతే ప్రపంచంలో బిడ్డల సౌభాగ్యాన్ని కోరేతల్లులంతా నేరస్తులేనా! యువరానర్! కాదు- ముమ్మాటికీ కాదు. ఇంక చట్టం దృష్టిలోకి రాని అసలు నేరస్తుడు లక్ష్మి భర్త. బాధ్యతా రహితుడై నిర్దాక్షిణ్యంగా భార్యాబిడ్డల్ని నిరాధారంగా నడివీధిలో వదలిన ఆ కిరాతకుడు నేరస్తుడుకాడా! కట్నం పుచ్చుకొని, తాడు గట్టి: సుఖాన్ని అనుభవించి, పిల్లలు పుట్టించడానికి వున్న బాధ్యత, పుట్టిన పిల్లల్ను, కట్టుకున్నభార్యను పోషించడానికి లేదా?

"మగవాడుకాబట్టి దులుపుకొనిపొయ్యాడు. కాని లక్ష్మి ఆడది. పైపెచ్చు ముగ్గురుపిల్లల తల్లి. గుండెలనిండా అమృతాన్ని నింపుకున్న మాతృమూర్తి. భర్తవదిలినా, పిల్లల్ని వదలేక వారి సౌఖ్యమే తన సౌఖ్యంగా భావించిన దేవత. ఆనాడే లక్ష్మి భర్త అంత బాధ్యతా రహితంగా ప్రవర్తించకుండా వుంటే లక్ష్మి కూడా అందరిలాగే కాపురం చేసుకుంటూ సుఖంగా వుండేది. ఈ నాడు ఇలా ముద్దాయిగా బోనులో నిలబడేది గాదు.

"పై వివరించ బడిన పరిస్థితుల్లో లక్ష్మి భర్తకు ఈ నేరంలో భాగం లేదంటారా?

"ఇక, ఈ నేరంలో రెండవ భాగస్వామి హత్య చేయబడిన రామూను పరీక్షించిన డాక్టరు. ముద్దాయి ఒక రోజు తన గ్రుడ్డిపిల్లవాడిని డాక్టరు వద్దకు తీసుకువెళ్ళింది- మరో కరి కేసులో తీరిక లేని డాక్టరు బిడ్డకుఅసలు కళ్ళురావు అని చెప్పాడు. డాక్టరు అలా చెప్పడంతో ఆమె నిరాశ చెందింది, తన బిడ్డబ్రతుకు జీవితాంతం చీకటి బ్రతుకయిందనిఆమె హృదయం ఆక్రోశించింది. దాని ఫలితమే ఈ నేరం.

"కాని, కోర్టు వారిముందు సాక్ష్యమిస్తూ ఆ డాక్టరు, తాను చూపు రాలేదని చెప్పలేదని, కంటి పాపలు ఎదగలేదని, కొన్నాళ్ళు పొయ్యాక ఆపరేషన్ చేస్తే చూపు వస్తుందని చెప్పారు. ఇవే మాటలు, డాక్టరుగారు ఓపికగా లక్ష్మితో చెప్పినట్లయితే, ఆమెఈహత్య ముమ్మాటికీ చేయదు. తన కడుపు మాడ్చుకొని అయినా సరే చాకిరీ చేసి, డబ్బుకూడబెట్టి తన బిడ్డకు ఆపరేషను చేయించుకునేది. చూపు తెప్పించుకొనేది.

"యువరానర్! ఎవరి బాధ్యతను వారు స


మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు
రిపబ్లిక్ డే శుభాకాంక్షలు.

ఫోన్స్ 74726
86-328
రె. సి. 72344

# శ్రీ సూర్యా మోటార్ వర్క్సు

పయినీర్స్ ఇన్ ఆటోమొబైల్స్ ఇండస్ట్రీ

బీసెంటురోడ్, గవర్నర్ పేట, **విజయవాడ-2.** బ్రాంచి: ఆటోనగర్

పార్టనర్స్: సి. హెచ్. సూర్యనారాయణ అండ్ బ్రదర్స్

అన్ని రకములైన ఆటోమొబైల్ పనులకు అన్నిరకముల లేతువర్క్సుకు
అధునిక యంత్రములపై అనుభవము గల పనివారిచే సకాలంలో

**రీబోరింగ్, క్రాంక్‌గ్రైండింగ్, బేరింగ్, రీ కండిషనింగ్ వగైరా**
**రిపేర్సు చేయబడును.**

**'METCO'** మెటల్ స్ప్రేయింగ్ మా ప్రత్యేకత
ఒకసారి దయచేసి ప్రయత్నించిన మీకే తెలియగలదు.

క్రమంగా నిర్వర్తిస్తే సమాజంలో ఇలాంటి సంఘటనలకు తావుండదని, లక్ష్మి లాంటి అమాయకులు ఉరికంబానికెక్కరని నేనుమనవి చేస్తున్నాను.

"ఇపుడు విచారించండి యువరానర్ ! ఈ ముద్దాయి నిజంగా హత్యచేసిందా ! లేక ఈ సమాజం ముద్దాయిచేత ఈ హత్యచేయించిందా ! ఈ హత్యకు ముద్దాయి ఎంతవరకు బాధ్యురాలు ? సాంఘిక న్యాయాన్ని దృష్టిలో వుంచుకొని తీర్పు ఇవ్వమని కోర్టువార్ని కోరుతున్నాను"

ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది లలిత- మనసులో కరుడుగట్టిన భావాలన్ని ఒక్కసారి ఉప్పెనలా ప్రవహించి నట్లయింది.

"అంతే యువరానర్" అని తన స్థానంలో కూర్చుంది లతలి-

"చూడండి లలితాదేవీ" గంభీరంగా ధ్వనించింది న్యాయమూర్తి రాఘవరావు గారి కంఠం.

"ఇంత వరకూ మీరు చేసిన వాదన నేల విడిచిన సాము వంటిది. ఈ కేసుకు సంబంధించి నంతవరకు చట్ట రీత్యా ముద్దాయి నేరం చేసింది- అదీ హత్యా నేరం. ఈ విషయం సాక్ష్యాధారాలతో నిరూపించ బడింది భారతీయ శిక్షాస్మృతి ప్రకారం హత్యానేరానికి రెండే శిక్షలు. ఒకటి ఉరి! శిక్ష రెండవది యావజ్జీవ ఖైదు- ఏ కోర్టు ఇంతకన్నా తక్కువ శిక్ష విధించలేదు- నేను సాక్షులు చెప్పిన సాక్ష్యాల నాధారం చేసుకొని. చట్టరీత్యా తీర్పు చెప్పగలవాడినే గాని, 'నాకు తోచింది న్యాయం' అని తీర్పు చెప్పలేను- అలా అయితే ఈ న్యాయవ్యవస్థ దెబ్బతింటుంది-

"కొన్ని సమయాలలో అంతరాత్మ 'ఇది తప్పు' అని ఘోషిస్తున్నా. సాక్ష్యాల ఆధారంగా అంతరాత్మకు విరుద్ధంగా తీర్పుచెప్పక తప్పదు- మీరు చెప్పిన విషయాల్తో నేను ఏకీభవిస్తున్నాను- ముద్దాయి భర్త, ముద్దాయిని వదిలేసిన కారణంగా ఈ దుర్ఘటన జరిగింది. కాని ఆ సంఘ జీవి. సాంఘిక న్యాయాన్ని విస్మరించి పశువుగా ప్రవర్తించాడు.

కాని, భార్యను వదిలిన భర్త మన వ్యవస్థలో నేరస్తుడు కాడు- అతడు భార్యను వదిలివేసిన కారణంగా జరిగిన దుర్ఘటనలకు అతన్ని శిక్షించ లేము- దీనికి చట్టం వప్పుకోదు-

ప్రస్తుత కేసులో ముద్దాయి నేరస్తురాలు. కాని ఆమె ఏ పరిస్థితులల్లో ఆ నేరం చేసిందో దృష్టిలో వుంచుకొని-ముద్దాయి లక్ష్మికి యావజ్జీవ కారాగార వాసశిక్షవిధిస్తున్నాను" కాని......

కోర్టంతా నిశ్శబ్దంగా వుంది. న్యాయమూర్తి ఇంకా ఏమిచెప్తారో అని అంతా చెవులు రిక్కించి వింటున్నారు- ముద్దాయి లక్ష్మి మాత్రం నిర్లిప్తంగా ఎటో చూస్తోంది.

"పబ్లిక్ ప్రాసిక్యూటర్ ! ముద్దాయి ఎంత కాలం జైలులో వుంది ?"

"దాదాపు ఒక సంవత్సరం నుండి యువరానర్" జవాబిచ్చారు రంగనాథంగారు.

"లలితాదేవి ! ముద్దాయిని రక్షించడానికి ఒక మార్గం వుంది. చట్టం ప్రకారం తన బిడ్డల్ని హత్యచేసిన నేరానికి తల్లి శిక్షింపబడితే ఆ కేసులు ప్రభుత్వానికి నివేదించాలి. ప్రభుత్వం వారు కేసును క్షుణ్ణంగా పరిశీలించి తగిన కారణాలు వుంటే, శిక్షను తగ్గించడం గాని లేక పూర్తిగా తీసివేయడం గాని చేస్తా ఈ కేసులో ముద్దాయి ఈ మినహాయింపుకు అర్హురాలుగానే భావిస్తున్నాను. ఈ ముద్దాయికి తన బిడ్డను చంపవలెనని ఉద్దేశ్యం వున్నా కోరికలేదు. తన బిడ్డ భవిష్యత్తు అంధకారం అవుతుందని తన బిడ్డ హీనాతిహీనమైన జీవితం గడప వలసి వస్తుందని, తన తదనంతరం తన బిడ్డకు ఎవరూ దిక్కు వుండరని, అపుడు ఆ గ్రుడ్డి వాడి బ్రతుకు అధోగతి పాలవుతుందని, ఊహించి, మాతృసహజమైన ఆవేదనతో బాధతో ఈ నేరం చేసింది. ఆ బిడ్డ భవిష్యత్తును ఆ విధంగా వూహించి అటువంటి దురతి నుండి తన బిడ్డను, తప్పించ వలెననే మంచి ఉద్దేశంతో ఆ బిడ్డను చంపిందే గాని ఆ బిడ్డను శ కొద్ది తుదముట్టించ వలెననే కోరిక ఆమెకు లేదు.

"పై కారణాలవల్ల ఈ కేసును నేను ప్రభుత్వానికి నివేదిస్తూ, ముద్దాయి లక్ష్మి ఇప్పటికే ఒక సంవత్సరం శిక్ష అనుభవించింది కాబట్టి, ప్రస్తుత శిక్షను ఆ మేరకు తగ్గించి, ముద్దాయిని విడుదల చేయవలసిందిగా గవర్నమెంటుకు శిఫార్సు చేస్తున్నాను."

లలితా దేవి ఒక్కసారిగ ఊపిరి పీల్చుకుంది.

అంధకారంలో ఆశాకిరణం కన్పించినట్టయింది. మరల ఈ ముద్దాయి కరుణామయ గాథను ప్రభుత్వానికి విన్పించవచ్చు. వారిని ఒప్పించ వచ్చు. లక్ష్మి తప్పకుండా విడుదలవుతుంది. లక్ష్మి పిల్లలు తల్లిలేని పిల్లలు కాకూడదు,

కోర్టు సమయం అయిపోవడంతో జడ్జిగారు తమ ఆసనం దిగి వెళ్ళిపోయారు.

కొండంత ఆత్మవిశ్వాసంతో లలితాదేవి కోర్టు విడిచి వెళ్ళి పోయింది.

